క్లుప్తంగా

వ్యర్థాలతో అవస్థలు



తెనాలిఅర్బన్: సాలిపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద వ్యర్థాల గుట్ట దర్శనమిస్తోంది. ఇక్కడ చెత్తను వేసి పదిరోజులు దాటిన ఇప్పటి వరకు మున్సిపల్ సిబ్బంది తొలగించలేదని స్థానికులు తెలిపారు. దీనివల్ల దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే దానిని తొలగించాలని వారు కోరుతున్నారు.

బైబిల్ పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోండి



తెనాలిఅర్బన్: బైబిల్ పఠనంపై చిన్నారులు ఆసక్తిని పెంపొందించుకోవాలని జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ తెనాలి ప్రతినిధి కాంద్రు ప్రకాష్ పేర్కొన్నారు. జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ప్రెయర్ టవర్‌లో జరుగుతున్న డైనమిక్ కిడ్స్ క్యాంప్ బుధవారం కొనసాగింది. చిన్నారులకు బైబిల్ వాఖ్యాల కంఠస్థం, క్రైస్తవ పాటలు, సంగీతం వంటి పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారంతో క్యాంప్ ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీచర్స్ సిహెచ్ శాంత కుమారి, ఎన్ పెర్సిస్ సౌందర్య రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రవేట్ ఐటీఐ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఈనెల 24వ తేదిలోపు ఆన్‌లైన్‌లోగాని, తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు నమోదు కేంద్రాలలో తప్పని సరిగా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు జూన్ రెండు నుంచి 10వ తేదిలోపు తెనాలి ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్.9347795839, 6304572793, 9014491772లలోగాని, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



తెనాలిఅర్బన్: వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఎస్.లావణ్య సుధ పేర్కొన్నారు. నెహ్రూరోడ్డులోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులు బుధవారం కొనసాగాయి. విద్యార్థులకు నీతి కథలు, మహనీయుల జీవిత విశేషాలు, పుస్తక పఠనం, తెలుగు గ్రామర్, పద్యాలు, కథలు వంటి వాటిని నేరిృంచారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయని చెప్పారు. ఆరు నుంచి పదోవ తరగతి చదివే విద్యార్థులందరు దీనిలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పుట్టిన రోజును పురస్కరించుకుని వారి శిష్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని నిరాశ్రయులకు బుధవారం నూతన వస్త్రాలు, అల్పాహారంను తెనాలి 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగ మండలి సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంత శ్రీనివాసరావు, కోమలదేవి, సూర్యనారాయణ, రాంబాబు, సుబ్బారావు, గోదావరి సత్యనారాయణ, రేఖ పాల్గొన్నారు.

చిన్నారులకు ఈత శిక్షణ

తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కృష్ణానది కరకట్ట వెంబడి ఉన్న ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఈత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు అసోషియేషన్ కార్యదర్శి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల చిన్నారులకు మే 4వ తేదీ నుంచి 25వరకు రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 8.30 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు 7981033007లో సంప్రదించాలని కోరారు.

బాబోయ్... కుక్కలు



ప్రధాన రహదారిపై కుక్కల విహారం

- పట్టణంలో పెరిగినపోతున్న వీధి కుక్కలు బెడద
- పాదచారులు, వాహన చోటుకులపై దాడి
- వైద్యశాలలో రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కకాటు కేసులు

రేపల్లె: పట్టణంలో వీధికుక్కల బెడద పెరిగిపోతుంది. దీంతో ప్రజలు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టాలంటే బాబోయ్ కుక్కలున్నాయి అంటూ భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కుక్కల స్వైర విహారం రోజురోజుకు పెచ్చరిల్లుతోంది. ప్రధాన రహదారులు, వీధులలో, బడులు, గుడులు, దుకాణాలు, పార్కులు ఎక్కడికి వెళ్లాలన్నా వీధి కుక్కల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బడికి వెళ్లే చిన్నారులు, వివిధ పనులపై రాకపోకలు సాగించే ప్రజలపై దాడులకు పాల్పడుతూ గాయపరుస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో సైతం కుక్కల బెడద అధికమవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనాల వెంట కుక్కలు పడి చోదకులపై దాడికి తెగబడి గాయాలపాలు చేస్తున్నాయి. పలు సందర్భాలలో వాహనాలకు కుక్కలు అడ్డుపడడంతో ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. పాదచారులు రహదారులు వెంబడి వెళ్లే సమయంలోనూ ఒక్కొక్కసారి కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. కుక్కల బెడద అధికమైనా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో ప్రజలు, ప్రజా సంఘాలు పెదవి విరుస్తున్నాయి.



మాంసపు వ్యర్థాలను నోటకరుచుకుని రహదారిపై ఇలా...

పట్టణంలో కుక్కకాటు కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గత ఆరు నెలల కాలంలో దాదాపు 250కుపైగా కేసులు నమోదయ్యాయంటే వీటి స్వైర విహారం పట్టణంలో ఏ విధంగా ఉందో తెలుసుకోవచ్చు.

మాంసపు వ్యర్థాల కోసం...

పట్టణంలోని పలు హోటళ్ల వారు మిగిలిన మాంసపు వ్యర్థాలను ప్రకాశం రోడ్డులోని అంబేడ్కర్ పార్కు పక్కన నిర్లక్ష్యంగా పడవేస్తున్నారు. ఈ మాంసపు వ్యర్థాలను తినేందుకు కుక్కలు అధిక సంఖ్యలో రహదారులపైకి చేరుతున్నాయి. అలా తినే క్రమంలో కుక్కల మధ్య ఘర్షణ చోటు చేసుకుని వాహనాలపై, మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి నడవాలన్నా, ప్రయాణించాలన్నా భయపడే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై సంచరించే వీధి కుక్కలను వేరే ప్రదేశాలకు తరలించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

కుక్కకాటు ప్రమాదకరం



కుక్క కాటు ఎంతో ప్రమాదకరం. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి పూర్తి చికిత్సలు చేయించుకోవాలి. వీధి కుక్కలలో రేబిస్ వైరస్ ఉండేందుకు అవకాశం ఉంటుంది. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవటంతో రేబిస్ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చు. పెంపుడు కుక్కలకు సైతం పశు వైద్యులను సంప్రదించి ఆరు నెలలకు ఒకసారి వ్యాక్సిన్ అందించాలి.

– డాక్టర్ పృథ్వీ గణేష్, ప్రభుత్వ వైద్యశాల, రేపల్లె

చర్యలు తీసుకుంటాం



కుక్కలతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి కుక్కలను పట్టించి ఇతర ప్రాంతాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటాం. రహదారుల పక్కన, జనసంచార ప్రాంతాలలో మాంసపు వ్యర్థాలను పడవేయకుండా హోటళ్ల నిర్వాహకులకు, మాంసపు విక్రయదారులకు ఇప్పటికే నోటీసులు అందించటం జరిగింది. వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందికి అందించాలి.

– కె.సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

సాయిబాబు వైన్స్ షాపుల్లో నీ వాటా ఎంత..?



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్

భట్టిప్రోలు (కొల్లూరు) : కూటమి ప్రభుత్వంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలలో అక్రమాలకు కొమ్ముకాస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు వైన్స్ షాపుల్లో నీ వాటా ఎంతో తేల్చాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం భట్టిప్రోలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా భట్టిప్రోలులో మద్యం దుకాణాలలో నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌ల విషయంలో నిజాలను నిగ్గుతేల్చేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు దుకాణాలను పరిశీలిస్తే నోటికొచ్చినట్లు ప్రేలాపనలు చేయడం తగదని హెచ్చరించారు. ముందు భట్టిప్రోలుకు చెందిన టీడీపీ నాయకుడు సాయిబాబు.. రైడ్‌కు, పరిశీలనకు మధ్య తేడా తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. మహిళలకు ఇబ్బందికరంగా ఉన్న అనధికార పర్మిట్ రూమ్‌లు, బెల్టు దుకాణాలకు కొమ్ముకాస్తూ టీడీపీ నాయకుడు పేలుతున్న అవాక్కులు, చవాక్కులను గమనిస్తే మద్యం దుకాణాలలో తనకు సైతం వాటాలు అందుతున్నాయని అర్థమవుతుందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న తమ నాయకుడు వరికూటి అశోక్ బాబుపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నభి, మండల కన్వీనర్ శ్రీనివాసరావు, భట్టిప్రోలు టౌన్ ప్రెసిడెంట్ కుందేటి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మావతి, కె.భూషణరావు, గోలి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, టి.యలమంద, వి.చిన్నారి, వి.నాగేశ్వరరావు, లింగం శ్యామ్‌సుందర్, శ్రీను, కె.ప్రసాద్, కోటయ్య, జంపాని రవి, రావుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారంపై గరం..గరం



మాట్లాడుతున్న ఆలయ పాలకవర్గ నేతలు

- శ్రీవాసవీ దేవాలయానికి స్వయం ప్రకటిత పాలకవర్గం చెల్లదు
- చెట్టుకింద కూర్చొని పేర్లు రాసుకుంటే ఎలా?
- ప్రమాణస్వీకారం ఎలా చేస్తారు ?
- సర్వసభ్య సమావేశంలో ఏ నిర్ణయమైనా సమ్మతమే!
- దేవస్థానం కమిటీ పాలకవర్గ నేతల వెల్లడి

తెనాలి: 'సభ్యుల ఎదుట జమా ఖర్చులు చదవకుండా, తీర్మానం చేయకుండా చెట్టుకింద కూర్చొని రాసుకున్న కమిటీ ఎలా చెల్లుతుంది? ప్రమాణ స్వీకారం ఎలా చేస్తారు? ఇప్పటికైనా మాకు వివాదం అవసరం లేదు. సర్వసభ్య సమావేశానికి హాజరుకండి. చక్కని వాతావరణంలో చర్చించుకుని ఏ నిర్ణయం తీసుకున్నా వాసవీ అమ్మవారి సాక్షిగా కట్టుబడి ఉంటా'మని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ పాలకవర్గం నేతలు ప్రకటించారు. పట్టణ బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ వివాదం నేపథ్యంలో స్వయం ప్రకటిత కమిటీ బుధవారం సాయంత్రం ప్రమాణస్వీకారోత్సవానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత కమిటీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిటీకి స్వయంప్రకటిత పాలకవర్గం చెల్లదని ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు స్పష్టం చేశారు. వుప్పల వరదరాజులు మాట్లాడుతూ దేవస్థానాన్ని ఎంతో అభివృద్ధి చేసిన అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు అనారోగ్యరీత్యా అమెరికాలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. 4న జరిగే సర్వసభ్య సమావేశంలో ఏకాభిప్రాయంతో వెళ్లాలని సూచించినట్టు తెలిపారు. అయినప్పటికీ స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణ స్వీకారం పేరిట హడావుడి చర్యలను సభ్యసమాజం గర్హిస్తోందని, ఎవరూ ఎన్నుకోకుండా చెట్టుకింద రాసుకుంటే సరిపోదన్నారు. వైశ్యుల సత్రాలు, దేవాలయాలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చూశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించటంపై ఆర్యవైశ్యులు సంతోషిస్తున్నారని గుర్తుచేశారు. వాసవి దేవస్థానంలో విభేదాలు, ఉద్రిక్తతలు సమంజసం కాదన్నారు. దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయం ప్రకటిత కమిటీ అధ్యక్షుడు పెండేల వెంకట్రావు చేసిన అభ్యర్థనతోనే ఆలయ కమిటీలో సామరస్యం కోసం నూకల వేణుగోపాలరావు వచ్చారని గుర్తుచేశారు. అప్పట్లో శిథిల భవనం ఉండేదని, అమ్మవారి ఊరేగింపులో ఛత్రం కూడా ఉండేది కాదని, నూకల వేణు చెన్నై నుంచి తెప్పించారని చెప్పారు. దాతల విరాళాలతో దేవస్థానంలో 4 కల్యాణ మండపాలు, సత్యనారాయణస్వామి ఆలయాన్ని నిర్మించారని అన్నారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చూడాలని కోరారు. స్వయం ప్రకటిత కమిటీలో సభ్యత్వం లేనివాళ్లు కూడా ఉన్నారని మద్దాళి శేషాచలం అన్నారు. ఆర్యవైశ్య నాయకులు మాలేపాటి హరిప్రసాద్, గొడవర్తి సాయిహరేరామ్, కొణిజేటి శంకరరావు, అన్నవరపు నరసింహారావు, అత్తలూరి నరసింహారావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, గురునాథగుప్త, సాయి, భాస్కర్ పాల్గొన్నారు.

ఈ నెల 3న జిల్లా పరిషత్ భూముల కౌలు వేలం

కర్లపాలెం: యాజలి గ్రామంలోని జిల్లా పరిషత్ భూముల సర్వే నంబర్ 494–1, 503–1లో గల 4.03 ఎకరాలు కౌలు వేలం ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని యాజలి పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ వ్యవసాయ భూముల సాగు కౌలుకు నిర్వహిస్తున్న వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీ అధికారులను సంప్రదించాలని కార్యదర్శి చెప్పారు. ఎకరాకు రూ.15,500 చొప్పున మొత్తం రూ.62,465గా ప్రభుత్వం ధర నిర్ణయించి బహిరంగ వేలం నిర్వహించవలసిందిగా ఆదేశాలు వచ్చినందున వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

పారిశ్రామిక వేత్తకు అవార్డు



యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెం పారిశ్రామిక వాడకు చెందిన పారిశ్రామిక వేత్త సరికొండ రామరాజు 'బెస్ట్ బిజినెస్ మ్యాన్' అవార్డు అందుకున్నారు. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన 40 మంది ప్రముఖులకు బుధవారం విశాఖపట్నం లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. అందులో భాగంగా సరికొండ రామారాజు ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ బొకట్‌కుమార్, అనన్య సాయి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రామరాజును పారిశ్రామిక వాడకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు అభినందించారు.

15 నుంచి క్రికెట్ పోటీలు

తెనాలిరూరల్: తెనాలి ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలావరణలో ఈ నెల 15వ తేదీ నుండి కేవైఆర్ అండ్ కేబీఎస్ క్రికెట్ లీగ్ పోటీలు నర్వహించనున్నారు. పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మహ్మద్ ఖుద్దూస్, పసుపులేటి త్రిమూర్తి, కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, కౌన్సిలర్ అన్నం పిన్నరావు, పట్టెం హరిబాబు, కోలా రాంమూర్తి, బత్తుల నరసింహరావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి: శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైల్వేస్టేషను వద్ద పేదలకు అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. యోగ సభ్యులు చిటుమడుగుల సురేష్‌బాబు వర్ధంతి సందర్భంగా భార్య చిటుమడుగులు శివలక్ష్మి, కుమారులు చైతన్య, మోహన్ సహకారంతో ఈ సేవ కార్యక్రమాన్ని చేశారు. ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దా భక్తుని రమణయ్య పర్యవేక్షించారు. శ్రీశివలింగేశ్వర భక్తసేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు వీబీఎస్ దోహదం



తాడేపల్లి రూరల్: పిల్లలు చిన్నతనం నుంచే ఆధ్యాత్మికత ఎదుగుదలకు విరామ బైబిల్ పాఠశాల(వీబీఎస్) దోహదపడుతుందని నూతన యేరూషలేము ప్రార్థనా మందిరంగ దైవసేవకులు ఐజాక్ చార్లెస్ అన్నారు. ఉండవల్లి నూతన యేరుషలేము ప్రార్థనామందిరంలో జరుగుతున్న వీబీఎస్ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఉండవల్లి పల్లె, లొద్ది, అమరారెడ్డి నగర్, అంబేద్కర్ కాలనీలో పిల్లలు ప్రత్యేకంగా కిరీటాలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పప్పెట్‌షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు సంఘ పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

బాలికా సంరక్షణ జిల్లా అధికారి జి.కృష్ణ



మాట్లాడుతున్న బాలికా సంరక్షణ అధికారి కృష్ణ

రేపల్లె: బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలిక సంరక్షణ జిల్లా అధికారి జి.కృష్ణ చెప్పారు. మండలంలోని పేటేరు భావన్నారాయణస్వామి ఆలయంలో గ్రామ కమిటీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గ్రామీణులకు తెలియపరచాలన్నారు. యువతికి 18, యువకునికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని చెప్పారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమన్నారు. అట్టివారికి రూ.లక్ష జరిమానా రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, అంగన్‌వాడీలు, ఆశాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె : పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశామన్నారు. నిరంతరం డ్రెయిన్‌లలో సిల్ట్‌ను, రహదారుల వెంబడి చెత్తను తొలగింప జేసేందుకు అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్య నెలకొనే వార్డులలో ట్యాంకర్‌ల ద్వారా పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. అనంతరం అజెండాలోని 27 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, అధికారులు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పౌరహక్కుల దినోత్సవం



పెరవలిపాలెంలో పౌర హక్కుల దినోత్సవంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర



ప్యాపర్రులో పౌరహక్కుల దినోత్సవంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య

అమర్తలూరు(వేమూరు): దళితవాడలోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దారు శివయ్య అన్నారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలో అంటరానితనం అమలు చేస్తే తమ దృష్టికి తీసుకొని రావలెనాని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి రోజున దళితవాడలో పౌరు హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హిమచంద్ర శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వెంకయ్య, వీఆర్వో త్రినాథ్, ప్రజలు పాల్గొన్నారు.

పెరవలిపాలెం(వేమూరు): అంటరానితనాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని డిప్యూటీ తహసీల్దారు రవీంద్రబాబు తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామం దళితవాడలో పౌరహక్కుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనం అమలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకొని రావలెనాని అన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. తాగు నీటి సమస్య, పారిశుధ్య సమస్యలు.. ప్రతి సమస్య రాతపూర్వకంగా ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సాయి, వీఆర్వో మోహనరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దాసరి సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం

ఏఎస్పీ టి.పి.విఠలేశ్వర్



ఏఎస్సై దాసరి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల: ఏఎస్సైగా దాసరి సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయమని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పేర్కొన్నారు. పదవీ విరమణ చేస్తున్న ఏఎస్సై దాసరి సుబ్రహ్మణ్యంను బుధవారం పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ 34 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో పని చేసి పదవీ విరమణ చేసిన సుబ్రహ్మణ్యం శేషజీవితం సంతోషంగా సాగాలని కోరుకున్నారు. దాసరి సుబ్రహ్మణ్యం 1990 సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా నియమితులయ్యారని, 2005లో ఏఆర్ విభాగం నుంచి సివిల్‌కు కన్వర్షన్‌కాగా సీఐడీ, కోస్టల్ సెక్యూరిటీ ఫోర్స్‌లతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ సారథి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞాచారికి నీతిపూడి స్మారక జాతీయ సాహితీ పురస్కారం



ప్రజ్ఞాచారికి పురస్కారం ప్రదానం

తెనాలి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు స్మారక సేవా జాతీయ సాహితీ పురస్కారాన్ని రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన 'సాహితీ రత్న' నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి అందుకున్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరంకు చెందిన మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని బుధవారం భీమా వెంకటేశ్వర కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డు సత్యనారాయణ, న్యాయవాది నీతిపూడి గణపతిరావు, మమత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కోరుకొండ జాను, కోట మోహన్‌రావు, వీవీఎస్ బొంతు గణపతిరావు చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు. ప్రజ్ఞాచారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నీతిపూడి గణపతిరావు స్మారక జాతీయ సాహితీ పురస్కారం అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.

స్పెల్లింగ్ మాస్టర్‌కు ఘన స్వాగతం



హార్దీకి స్వాగతం పలుకుతున్న బీజేఆర్ కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: మాస్టర్ స్పెల్లర్స్ డాట్ కాం ఆధ్వర్యంలో ఏప్రిల్ 28వ తేదీన గుజరాత్‌లోని వడోదరలో జరిగిన జాతీయ స్థాయి స్పెల్లింగ్‌కాంపిటీషన్‌లో పట్టణానికి చెందిన బాలుడు అత్తోట హార్దీ మాస్టర్ స్పెల్లర్స్ అవార్డు గెలుపొందాడు. మంగళవారం రాత్రి తెనాలి చేరుకున్న హార్దీకి బాబు జగ్జీవన్‌రామ్(బీజేఆర్) కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పట్టణ ఐతానగర్‌లోని మాజీ కౌన్సిలర్ అత్తోట వందనం మనుమడు హార్దీ. కొల్లూరులోని ఫో ఫ్రంట్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. బాలుడికి స్వాగతం పలికిన వారిలో కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్, సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్, శరత్, రమేష్, జయప్రకాష్, కాయమ్, సుధీర్, దిలీప్ ఉన్నారు.